


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### శుభవార్త!

**మా ఇంట్లో పెళ్ళి అనుకునేరు.** అదేంకాదు. ప్రొద్దుటే, తలగడ క్రింద ఉన్న నా కణ దూరశ్రవణ యంత్రం ఆపకుండా అరిచి నన్ను నిద్రలేపింది. అర్థం కాలేదా? సెల్‌ఫోన్ కొచ్చిన తిప్పలు. నిన్నంతా నేను రవీంద్రభారతిలో పలువురు పెద్దలు, ‘తెలుగుని పరిరక్షించండి. అంతరించకుండా బ్రతికించండి‘ అన్న ఆర్తనాదాలు విని వచ్చి ఉండడంతో ఇలా తెలుగు తన్నుకొచ్చేస్తోంది.

ఫోన్ మోగడం శుభవార్త ఎలా అయింది అంటారా? ఇంకా నేను బ్రతికే ఉన్నాను. రాత్రి నేను పడుకుని ఉండగా యుగాంతం సంభవించలేదు. మరి ఇది శుభవార్త కాదూ? డిసెంబర్ 22, 2012న యుగాంతం అన్నారుగా! వాళ్ళెవరో సినిమా కూడా తీసారు. చచ్చేట్లు సీటు చివార్న కూర్చుని మరీ చూసాం. ఇంకవారమే.. రెండు రోజులే అని నా ముంబై ఫ్రెండ్ ఫేస్ బుక్‌లో కౌంట్ డౌన్ స్టార్ట్ చేసి రోజూ రకరకాల వంటలు పెట్టింది. పోయేవాళ్ళు చేసుకు తిని పోతారని. నేనైతే కొంత మందితో దెబ్బలాడి అనాల్సిన మాటలన్నీ అనేసాను కూడానూ. ఇంకెటూ ఉండం కదా అనీ! కానీ ఏ అంతమూ కాలేదు. ప్రొద్దుటే కిళాంబి జ్యోతిర్మయి మేడం నాకు ఫోన్ చేసి "బంగారు తల్లీ నిద్రలేచావా? రాత్రి అంకుల్ చెప్పారు. నిన్న నువ్వు రవీంద్రభారతిలో ఏం మాట్లాడావో" అంటూ, నేను తెలివి తెచ్చుకుని, తల తడుముకుని ఏం మాట్లాడానో ఆలోచించా. అవాకులూ చవాకులూ ఏవైనా అన్నానా అని. సాధారణంగా నేను మైండ్‌లో ప్రిపేర్ అయ్యేదొకటీ, మాట్లాడేదొకటీనూ! పేపర్ మీద పెట్టుకుని మాట్లాడడం అలవాటు లేదు. పైగా నేను మొదట్లో ఒకటో, రెండో మూడో అధమ పక్షం నాలుగో స్పీకర్‌గా ఉన్నప్పుడు మాట్లాడేది కాస్త తీరువుగా ఉంటుంది. కానీ 24వ స్పీకర్ అయినప్పుడు నా సహనం క్రమంగా నశించి, నేను మాట్లాడదలుచుకున్న పాయింట్లు అన్నీ ఒకొక్కరే మాట్లాడేస్తూ ఉంటే కొట్టేసుకుంటూ వచ్చి, చివరికి "అందరికీ నమస్కారం. నాకీ అవకాశం ఇచ్చిన సో అండ్ సో పెద్దలకి కృతజ్ఞతలతో" ముగుస్తుంది.

అందుకే కాస్త ఆలోచించాను. "ముచ్చటగా మూడు పాయింట్లు చక్కగా చెప్పావుట. మా ఆయన మెచ్చుకున్నారు. ఆ అమ్మాయికి అద్భుతమైన భవిష్యత్తు ఉందన్నారు" అందావిడ.

ఆ చివరి వాక్యం ఎందుకంటే నా జాతకం చూసిన ఏకైక సిద్ధాంతి ఆయనే. ఈ జ్యోతిర్మయి మేడం నాకు డిగ్రీలో తెలుగు లెక్చరర్. ఆవిడలాంటి అధ్యాపకుల చలవే నా పెన్‌లో మిగిలిన ఈ నాలుగు తెలుగు అక్షరాలు.

ఆవిడ బయోడేటా రాస్తే ముప్పై పేజీలుంటుంది. ఆవిడకి బి.ఏ నుండీ డాక్టరేట్ దాకా అన్నీ గోల్డ్ మెడల్సే. నేను కాదు ఆవిడ ‘బంగారు తల్లి‘

ఇంతకీ ఆవిడ చెప్పిన మాట 'మాతృభాషని చంపేస్తున్నారు. అంతరించిపోతోంది' అని గోల పెడ్తున్నారు కానీ 'మాతృశబ్దం' మనది కాదు సంస్కృతం - 'అమ్మ'కూడా మనదికాదు.

'తల్లి' మాత్రమే తెలుగుమాట అన్నారు. మనం 'తల్లిమాట' లేక 'తల్లి భాష' అనాలి. మేం ఇద్దరం కాసేపు 'ఒకొక్కరూ ఏం మాట్లాడారూ? రిటైరయ్యాక కూడా ఆచార్యా అని పేరుకి ముందు పెట్టుకోవచ్చా? కాయితాల మీద చాలా చాలా రాసుకొచ్చి చదివిన వారి ప్రసంగాలలో వేలిడ్ పాయింట్స్ ఏవిటీ? ఎవరు ఏ చీరకట్టుకొచ్చారు? భోజనాలు ఎన్నిగంటలకి చేసాం' దాకా లోకాభిరామాయణం మాట్లాడుకున్నాం. చాలామందికి ఒత్తులు పలకవు కాబట్టి లక్ష ఒత్తుల నోములాగా ఒత్తులు పంచాలని కూడా అనుకుని నవ్వుకున్నాం.

***ఇప్పుడు మీ అందరికీ రెండో శుభవార్త చెప్తున్నాను.***

అసలు 'యునెస్కో' అనే సంస్థ అంతరించిపోయే భాషల్లో తెలుగు పేరు చెప్పనేలేదుట. ఈ మాట నిన్న జంపాల చౌదరిగారు చెప్పగానే 'అమ్మయ్యా' ఇంకెందుకు అయితే ఈ ప్రయాస అనిపించింది.

అసలు వదంతులు ఎలా పుడ్తాయండీ? ఎవరో తెలుగువారి వల్లే పుడ్తాయి. అందుకే శంకర నారాయణగారు యునెస్కోలో తెలుగువాళ్ళు ఎవరైనా పని చేస్తున్నారా అని వాకబు చేసారుట. లేరని తెలిసిందిట!

అక్కినేని నాగేశ్వరావుగారు 'అసలు రక్షించుకోవడం, పరిరక్షించుకోవడం మన భాషను అనడమే నాకు నచ్చలేదు' అని నిర్మొహమాటంగా చెప్పేసారు.

**నాకైతే గత కొన్ని నెలలుగా ఈ తెలుగుని బ్రతికించుకోవడం సభలకి వెళ్ళి, వెళ్ళి, తెలుగు ముక్కుల్లో ఆక్సిజన్ గొట్టాలతో, వెంటిలేటర్ మీద ఉన్నట్లూ, ఐ.సీ.యూ బయట మనం అంతా బిక్క మొహాలేసుకున్నట్లూ కలలొచ్చాయి.**

జొన్నవిత్తులుగారు చాలాసేపు వారి చిన్నతనంలో ఇసుక దిబ్బల మధ్య తాము దొంగా పోలీసు ఎలా ఆడారో చెప్పుకొచ్చారు. ఈ ఆటలకీ తెలుగు భాషకీ ఏం సంబంధం అని అంతా విస్తుపోతూ నోళ్ళు తెరుచుకుని వింటుండగా, ఆ ఇసుక దిబ్బలని ఎలా తవ్వేసారో చివరికి మళ్ళీ దిబ్బలొచ్చి ఎలా చేరాయో చెప్పి, మన తెలుగు భాషని కూడా అలాగే ఆ 'దిబ్బ'ల్లాగే ఎవరూ నాశనం చెయ్యలేరని చెప్పారు. బాగుంది.

వడ్డేపల్లి కృష్ణగారు కొరడా 'ఝుళిపించ'డం అన్న పదం తప్పు. 'ఝుళిపించాలి' అన్నారు.

కానీ ఇంకో పండితుడు భోజనాలప్పుడు, రెండూ తప్పే అది 'జడిపించడం' అనే తెలుగు పదం. వత్తు పెడితే కాస్త ధాటిగా ఉంటుందని అనవసరంగా 'ఝు' వాడ్తున్నారు అన్నారు.

గొల్లపూడి వారు తను ఇంట్లోనే తెలుగు నేర్పించలేకపోయాననీ, గొల్లపూడి మారుతీ రావు అన్న పేరుని చూపించి 'ఇక్కడ నీ పేరు ఉంది' అని గుర్తుపట్టడమే నేర్పించగలిగాననీ బాధపడ్డారు. బహుశా మనవలు పుట్టాక మన అందరి పరిస్థితీ ఇదే

అక్కినేని నాగేశ్వరరావుగారు 'తెలుగులో అమ్మా, నాన్నా అనకపోతే దవడ పగిలిపోతుంది- అని నా పిల్లలకి తెలుగు నేర్పించుకున్నాను. మనవల సంగతి వాళ్ళు చూసుకోవాలి. వాళ్ళు చూసుకోపోతే నేనేం చెయ్యగలను?' అన్నారు.

గరికిపాటి నరసింహారావుగారు 'ఈ కార్పోరేటు స్కూళ్ళలో మీ పిల్లలని మేమే చదివిస్తాము, నిద్రపుచ్చుతాము, నిద్రలేపుతాము, మేమే పెళ్ళిళ్ళు చేస్తాము, పిల్లలని కనిపిస్తాము అన్న టైపులో ప్రకటనలిచ్చుకుంటున్నారు. కానీ ఎప్పుడో అప్పుడు దయతలచి ఇంటికి పంపిస్తారు కదా అప్పుడైనా తెలుగు పద్యాలు చదివి వినిపించండి. అర్థాలు మాత్రం చెప్పకండి ఎలాగూ తప్పులు చెపుతారు. అలా రోజూ వినటం వల్ల వాళ్ళకి తెలుగు పద్యం అంటే తెలుస్తాయి' అన్నారు.

నేను ఇంటికొచ్చి నా 'ఒక బృందావనం' నవల తీసి మా అబ్బాయిని పిలిచి 'ఇందులో ఒక పేజీ చదువు' అని పరీక్ష పెట్టాను.

"Mom I am getting late.. I am going to…" అని ఏదో చెప్పబోయాడు.

"మామ్ అనగానే మొదటిసారే నిన్ను చెంప పగలకొట్టాల్సింది" అన్నాను.

వాడు పరిస్థితి గంభీరంగా ఉందని తెలిసి నాలిక కరుచుకుని "అమ్మా ఎప్పుడూ అమ్మా అనేగా అంటాను. అమెరికాలో ఉన్నప్పుడు కూడా అమ్మా అనేగా అన్నానూ" అని ఏదో చెప్పబోయాడు.

"అమెరికాలో ఉన్నప్పుడు అందరూ 'అమ్మా' అనే అంటారు. ఇక్కడకి రాగానే మామ్, డాడ్ అంటున్నారు. ఏం తప్పు చేసిందిరా నా దేశం? నా తెలుగు గడ్డా?' అని ఆవేశపడ్డాను.

"బి.పి టాబ్లెట్స్ వేసుకున్నావా ఇవాళ?" అని పక్కనుండి మావారి ప్రశ్న.

"అన్నీ తగలడ్డాను. చివరికి వీళ్ళకి నేను రాసిన నవల చదవడం రావట్లేదు" అని గుణనిధి కథలో 'అక్క' బాధపడినట్లు బాధ పడ్డాను. (కొద్దిగా మహానటిని అనుకరిస్తూ)

మా అశ్విన్‌కి ఆవేశం వచ్చింది. "ఏదీ ఆ ఒక బృందావనం ఇటియ్యి చదివి పెడ్తాను" అని అందుకున్నాడు.

"ఆఫీసుకి.. బయలు... దేరుతూ అల.. మారులోంచి షర్టు.... తీసిచూ.. స్తే నలిగిపోయి... అంది... సారీ ఉంది. అది.. అలగే మళ్ళీ సారీ అలాగే మడి... మడి.. మడిచి పట్టుకుని బ...య...ట...కి బయటికి వచ్చాడు!- చూడు ఒక పేరా ఎలా గడగడా చదివేసానో" అన్నాడు.

"ఇదా గడగడా చదవడం? రోజూ తెలుగు పేపర్ నాకు మొదటి పేజీ చదివి వినిపించి ఆఫీసుకి వెళ్ళాలి" అన్నాను.

"మొక్కై వంగనిది.. మానై వంగుతుందా? " అన్నారు ఛానెల్ మారుస్తూ మా వారు పక్కనుండి.

అశ్విన్ మళ్ళీ "మా ఫ్రెండ్స్‌కి ఇది కూడా రాదు" అన్నాడు కోపంగా.

"ఎవరెవరికి రాదో పేర్లు రాసియ్యి అందరికీ సాయంకాలం మనింట్లో ఉచిత బోధనా తరగతులు" అన్నాను.

"అమ్మా మేం అంతా ఎమ్.ఎస్ పూర్తి చేసి ఉద్యోగాలు చేస్తున్నాం. మీ తరంలోలాగా అయితే ఇప్పటికి మాకు పిల్లలుండేవాళ్ళు. ఇప్పుడు నువ్వు చెవి నులిమి ట్యూషన్లు చెప్తావా?" అన్నాడు.

"ఎంత పొడుగైతే ఎన్నేళ్ళు వస్తే ఏం లాభం? తెలుగు రాకపోయాకా" అన్నాను.

"నాకు వచ్చింది. నేను బాగానే చదివాను. ఇలా నేను ఇంటర్‌లో ఉన్నప్పుడో, బి.ఆర్క్‌లో ఉన్నప్పుడో, జీ.ఆర్.ఈ. రాసినప్పుడో పట్టించుకుంటే బావుండేది. నేను జీ.ఆర్.ఈలో 1380 స్కోర్ వచ్చింది అంటే, "సర్లే ఫోన్ పెట్టెయ్. సిట్టింగ్‌లో ఉన్నాను అన్నావు" అన్నాడు దెప్పి పొడుస్తూ.

"నేను ఆలశ్యంగా కళ్ళు తెరిచాను" అన్నాను.

"అందుకే రాత్రంతా చెత్త ప్రోగ్రామ్స్ టీ.వీలో చూడకుండా పెందరాడే పడుకోవాలి" అన్నారు మా వారు మళ్ళీ.

"నేను కళ్ళు తెరవడం అంటే నిద్రలేవడం గురించి కాదు" అని అరిచాను. టైం దొరికితే లేట్‌గా లేచే నా అలవాటుని దెప్పుతుంటారు ఆయన.

"నువ్వెళ్ళి చిన్నాడిని నేను పిలుస్తున్నానని చెప్పి పైకి పిలు" అన్నాను.

ఆ మాటకి అశ్విన్ కడుపు పట్టుకుని నవ్వడం మొదలు పెట్టాడు.

"ఎందుకా నవ్వు" కోపంగా అడిగాను.

"వాడికి అసలు తెలుగు సరిగ్గా మాట్లాడ్డమే రాదు చదవడం ఏం వస్తుంది?" అన్నాడు.

నేను తెల్లబోయాను "రాదా?" అన్నాను.

అశ్విన్ నవ్వు ఆపుకుని "రాదు.. నువ్వు లేనప్పుడు ఫోన్ వస్తే తీసి "హలో.. ఎవడు మాట్లాడ్తున్నారండీ?" అనేవాడు అన్నాడు.

"అది చిన్నప్పుడు" అన్నాను.

"హూ.. హూ..హూ" అన్న వికటట్టహాసం పక్కనుండి వినిపించింది. అది మా ఆయనదే రిమోట్ పక్కన పడేసి పడుకుంటున్నారు.

"వాడు తెలుగు సరిగ్గా మాట్లాడడం లేదని నాకు ఎప్పుడూ చెప్పలేదేం?" అన్నాను.

"అన్నీ నేను చెప్పాలా?" అన్నాడు అశ్విన్.

నేను మా చిన్నాడు కృష్ణ తెలుగు ఎలా మాట్లాడ్తాడా అని కాసేపు ఆలోచించాను. కన్నతల్లిగా నాకు తప్పులేం గుర్తురాలేదు.

"ఫరవాలేదు. ఈ ఫాల్‌కి వాడూ అమెరికా వెళ్తాడుగా తెలుగొచ్చేస్తుంది. లేదా నేను మా ఫ్రెండ్స్‌ని ఎవరైనా 'మాబడి' నేర్పేవాళ్ళుంటే చూడమని చెప్తాను" అన్నాను.

ఇంతలో మా ఆయన "బయట ఆరేసిన బట్టలన్నీ 'పచ్చిగా' ఉన్నయి ఆరాక తియ్యమని పనిమనిషికి చెప్పు" అన్నారు.

"సరే బట్టలు పండాక తీస్తుందిలెండి" అన్నాను ఉక్రోషంగా.

"ముందు ఆయనకి నేర్పించు" అని ఓ నవ్వు నవ్వి వెళ్ళిపోయాడు మా పెద్దాడు.

నేను మా ఆయన మీద విరుచుకుపడ్డాను. "మనం చిన్నప్పుడు చదివిన బడి ఒకటేగా.. మీకు మంచి తెలుగు ఎందుకు రాలేదూ?" అని.

ఆయన ముసుగులోంచే సమాధానం ఇచ్చారు. "మాకు తెలుగు చెప్పిన ఫిలోమినా టీచర్‌కి 'ళ' తర్వాత 'క్ష' రావాలా, లేక 'క్ష' తర్వాత 'ళ' రావాల అని రోజూ డౌటే ఉండేది. అసలు ఆ బడిలో ఎవరికి తెలుగొచ్చు చెప్పూ?" అని.

"సరే తర్వాత మారిన బడిలోనో?"

"ఇంగ్లీషు మీడియంగా!"

"నేనూ ఇంగ్లీషు మీడియమే, అయితే తెలుగు ఉండదా? " రెట్టించాను.

నాకు ఏదైనా కంప్యూటర్లో తెలీకపోతే ఆయన ఇలాగే కంఠం పెంచి బోధిస్తారు.

"నాది సెకెండ్ లాంగ్వేజ్ శాన్స్‌క్రీట్"

"పోనీ సంస్కృత పండితులైనా అయ్యారా?"

"తరువాత కాలేజ్‌లో ఫ్రెంచ్ తీసుకున్నాను"

"అయితే మనం ఫ్రాన్స్ వెళితే భాషా సమస్య ఉండదన్నమాట" వ్యంగ్యంగా అన్నాను.

"ఏంటి గోల? హాయిగా పడుకోనీయకా?" అన్నారు.

ఇందాక సభలో అంతా మనవలకి తెలుగు నేర్పించుకోలేకపోయామని బాధపడ్డారు. కానీ నేను మా ఆయనకీ పిల్లలకీ కూడా ఛీ...ఛీ ఎందుకీ జన్మ అనుకున్నాను.

మల్లాదిగారి సతీమణి పద్మజ "మిథునం చూద్దామా?" అని నిన్న నేను సభలో ఉండగా మెసేజ్ పెట్టడం గుర్తొచ్చింది. వెంటనే కాంతికిరణ్ గారికి ఫోన్ చేసాను.

"పద్మజ మిథునం చూద్దామా? అని అడుగుతోంది" అన్నాను.

"ముందు కాలమ్ రాయండి.. తర్వాతే మిథునం" అందావిడ.

కొరడా ఝుళిపించినట్లైంది (కరెక్ట్ పదం తెలిసిందోచ్)

పేపర్లు ముందేసుకుని కూర్చున్నాను.

7రోజుల్లో అనే సినిమాకి పాటలన్నీ నేనే రాసాను. ఆ నిర్మాత ఫోన్ చేసారు.

"రేపు ఆడియో లాంచ్ మేడం మీరు ముఖ్యం. తప్పక రావాలి" అని.

రేపే అన్నయ్య మనవడి రిషి బారసాల. ఈ ఫంక్షన్ గురించి చాలా ప్లానింగ్ జరిగింది. పైగా ఒకే సమయం ఫిక్స్ చేసుకున్నారు ఎలా?

ఏమీ ఆలోచించకుండా కాలమ్ స్టార్ట్ చేసాను, జ్యోతిర్మయి మేడం ఫోన్ కాల్‌తో.

నేను కాలమ్ రాయడం చివరికి వచ్చేసరికి మా నిర్మాత ఆఫీసు నుండి నికిత అనే తెలుగురాని పిల్ల తియ్యని కాకలీ ధ్వనితో "రేపు ఆడియో లాంచ్ పోస్ట్‌ఫోన్ అయింది మేమ్ సారీ!" అని చెప్పింది.

నాకు నవ్వొచ్చింది. గర్వం అనిపించింది. తొందరపడి అన్నయ్యకి ఈ విషయం ఫోన్ చేసి చెప్పనందుకు.

ఈ సంవత్సరం అంతం అయినా యుగాంతం అయినా తెలుగు భాష ఉన్నా కనుమరుగైనా మానవుడు ఉన్నంత కాలం ఇదే కన్‌ఫ్యూజన్. గందరగోళం. భూగోళం మీద ఏ ప్రాణికీ ఇంత గందరగోళం ఉండదు. బిజీగా ఉంటాయి కానీ మనలా గజిబిజిగా ఉండవు.

సమస్య వచ్చినప్పుడు కాసేపు దాని గురించి మరిచిపోయి పెండింగ్‌లో పెడ్తే దానంతటదే పరిష్కారమవుతుంది అని నేనే రాసాను. కానీ ఎప్పుడూ ఆచరణలో పెట్టలేదు. మొదటి సారి పెట్టి సక్సెస్ అయ్యాను.

యుగాంతం కాదు కానీ సంవత్సరాంతం వచ్చేస్తోంది. ఏం సాధించాం? మొదలుపెట్టిన నవల పూర్తి చెయ్యలేదు. కొనుక్కొచ్చిన పుస్తకాలు అన్నీ చదవలేదు. వెళ్దాం అనుకున్న యాత్రలు చెయ్యనే లేదు. పట్టుమని నెలరోజులు వరుసగా వాకింగ్‌కి వెళ్ళలేదు.

డైటింగ్ నెలకి నాలుగుసార్లు మానేసాం.

చేసిందల్లా ఓసారి అమెరికా వెళ్ళి రావడం. మళ్ళీ తెలుగు గురించి కబుర్లూ, సందడీ. బంధువుల్లో, స్నేహితుల్లో చాలామందికి పిల్లల పెళ్ళిళ్ళు అయ్యాయి... మనవలు కూడా పుట్టారు.

నంది అవార్డు జ్యూరీలో ఉండగా కొన్ని మంచి సినిమాలు చూసాం.

'గంటల బండి', 'ప్రయత్నం', 'శిఖరం' అనే బాలల చిత్రాలు చూసాం. ఇవి మంచి ప్రయత్నాలు!

కొంతమంది కొత్త స్నేహితులయ్యారు.

డిసెంబరు నెలలో ఎవరూ ఇంట్లో మా వంటలు మమ్మల్ని చేసుకుని తిననియ్యడం లేదు. అన్ని పెళ్ళిళ్ళు.. శుభకార్యాలు.

కాంతికిరణ్ గారొచ్చారు. నేనూ మల్లాది పద్మజా, కాంతీ 'ఎటో వెళ్ళిపోయింది మనసు' సినిమాకి వెళ్ళాం. ఒక్కసారిగా చిన్నపిల్లలమై పోయి, కాలేజీ రోజుల్లోలాగా కామెంట్స్ చేస్తూ, సినిమా చూసాం.

చివరకి అటువాళ్ళూ, ఇటువాళ్ళూ 'మేడం మీరు లేకపోతే మేం ఈ సినిమా ఇంతగా ఎంజాయ్ చేసేవాళ్ళం కాదు" అని చెప్పివెళ్ళారు.

'అంగిటి' అనే పంజాబీ రెస్టారెంట్‌లో లంచ్‌కి బఫే ఉంటే వెళ్ళాం. తరువాత విశాలాంధ్రకి వెళ్ళాం. పుస్తకాలు చూసి ఒళ్ళు మరిచిపోయాం.

ఆబిడ్స్ తాజ్‌లో మసాలా దోశ తిన్నాం. మమ్మీస్ డే అవుట్ అని ఫేస్‌బుక్‌లో స్టేటస్ పెట్టాం. ఫోటోలు తీసుకున్నాం. దారంతా కబుర్లు చెప్పుకున్నాం. అయినా తనివి తీరలేదు... ఇవే డైరీలో మిగిలిపోయే మధుర స్మృతులు.

నా 2012 డైరీలో ఆఖరి నెలలో అందమైన పేజీ మేం ముగ్గురం కలిసి చేసిన అల్లరి.

తెల్లవారితే ఎన్నో దుర్వార్తలు.. అలజడులు.. పనులు.. ఒత్తిడులు.. సంఘర్షణలు.. వీటన్నింటి మధ్యనా ఉపశమనం పుస్తకాలూ, స్నేహితులు.

ఇల్లు గుర్తురాకుండా ఇల్లాలు తిరిగితే తప్పనుకునే మనస్తత్వం మనలో చాలామందికి ఇంకా పోలేదు.

కానీ ఇల్లాలికి ఓ సెలవు చీటీ రాసే అవకాశం ఇవ్వండి. అప్పుడప్పుడూ రెక్కలు విప్పి ఎగరనీయండి. అలాంటప్పుడే గుర్తొస్తుంది 'ఎటో వెళ్ళిపోయింది మనసు' అనే పాట.

నిన్న సభలో తెలుగు అంతరించిపోకుండా సూచనలు అడిగారు.

ఎందరెందరో మేధావులు ప్రభుత్వం చెయ్యాల్సిన విధుల గురించీ, తల్లితండ్రుల కర్తవ్యం గురించీ మాట్లాడారు.

ఒక కన్యాశుల్కం నాటకం యువతకి చూపించండి. మనపక్కనే వాళ్ళని కూర్చోమనాలి. రామప్ప పంతులుని మధురవాణి తెలివిగా ఇరికించే సంభాషణలకీ, అగ్గిహోత్రావధానుల ధూర్తానికీ 'ఎంకి పెళ్ళి సుబ్బి చావు కొచ్చింది,' 'తాంబూలాలిచ్చేసాను తన్నుకు చావండి' అన్న సామెతలుగా మారిన డైలాగులకీ, 'లొట్టిపిట్టలు' అన్న మాటకి మధురవాణి నవ్వే నవ్వుకి, మనలా ఆనందించగలరేమో చూడండి' గురజాడవారి చమత్కారాన్ని వందేళ్ళయినా ఇంకా అనుభవించి ఆనందిస్తూనే ఉన్నాం.

ఒక 'తెనాలి రామకష్ణ' సినిమాకో 'మాయాబజార్'కో తీసుకెళ్ళండి. మనం ఆ పద్యాలకి పులకించి పోతూ చప్పట్లు కొడ్తుంటే, మనవైపు వెర్రి మొహాలు పెట్టి చూస్తుంటే, అప్పుడు చెప్పండి యువతకి.

"ఇదీ మీరు కోల్పోతున్నది. పానుగంటి వారి వ్యాసాల్లో, పిలకా గణపతి శాస్త్రి, మొక్కపాటి వారి హాస్యకథల్లో, ఉన్న చమత్కారాన్ని, కృష్ణశాస్త్రి, దువ్వూరి, రాయప్రోలు, బసవరాజు ఇత్యాదుల భావుకత్వాన్ని ఇంత సాహిత్య సంపదని.. భాగ్యరాశిని" అని వారికి కళాశాలల్లో, పాఠశాలల్లో ప్రదర్శనలిచ్చి మరీ చెప్పండి.

పద్య రచన, పద్య పఠన పాఠాలు చెప్పి పోటీలు పెట్టి, పాటలు కట్టి చెప్పండి.

ఇదే దవడ వాచేట్లు కొట్టి చెప్పడం అంటే!

**'నును మబ్బు లేదున్క - కొనలపై సోనిలా**
**నెలవంక చిరునవ్వు చలువ పాట**
**తొలిప్రొద్దు పొడుపు రేకుల పైడిదారుల**
**ఏరులా మంచు కన్నీరు పాట..'**

అన్న కృష్ణశాస్త్రిగారి పద్యంతో ఈ సంత్సరానికి వీడ్కోలు చెప్దాం! కొత్త సంవత్సరానికి 'స్వాగతం' పలుకుదాం!

●●●

Click here to share your comments on this story.

